ట్రంప్ కోసం పాకిస్థాన్ ప్రధాని ప్రయత్నాలు.. పట్టించుకోని నోబెల్ కమిటీ

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం

నిలువుటద్దం

విలేకరులు కావలెను...

సంచలన దినపత్రిక నిలువుటద్దం కు – తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాల వారీగా, మండలాల వారీగా పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9059548848

హైదరాబాద్. ఎడిటర్:- వై. రమ నాగరాజు సంపుటి:-32 సంచిక:-226 శనివారం 10-10-2026

ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలో పాల్గొన్న సీఎం రేవంత్

- ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజించారు: రేవంత్ రెడ్డి
- ఓటమి భయంతో పేదల ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్ర అంటూ రేవంత్ ఫైర్
- ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణకు బీజేపీ ప్లాన్ అంటూ ఆరోపణలు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్
- ఓట్లు తీసేస్తే రేపు రిజర్వేషన్లు కూడా తీసేస్తారని హెచ్చరిక

ఓటమి భయంతోనే బీజేపీ దేశంలోని పేదల ఓటు హక్కును హరించాలని కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పేదలు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు, మైనారిటీలు బీజేపీకి

తెలంగాణలో మండుతున్న ఎండలు

- పలుచోట్ల 37 డిగ్రీల ఉష్ణోగ్రత
- తెలంగాణలో మళ్లీ పెరిగిన ఎండల తీవ్రత
- ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రారంభం

తెలంగాణలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతోంది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండ ప్రతాపం, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం - మిగతా 2 లో

రైతులకు బేడీలా?: కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఆగ్రహం

- జూరాల నీటి కోసం ఆందోళన చేసిన రైతులపై కేసులు నమోదు
- ప్రభుత్వ చర్యపై తీవ్రంగా మండిపడ్డ మాజీ మంత్రి హరీశ్ రావు
- ఇది ప్రజా పాలన కాదు, ప్రజా పీడన అంటూ విమర్శలు
- రైతులపై కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్
- లేదంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక

ఉక్రెయిన్‌పై రష్యా రాకెట్ దాడి.. బస్టాప్‌లో 33 మంది పౌరుల మృతి

- ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి
- తూర్పు ఉక్రెయిన్‌లోని క్రమటోర్స్క్ బస్టాప్‌పై బాంబుల వర్షం
- ఘటనలో 33 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయిన వైనం
- ఈ ఏడాదిలో ఇదే అతి పెద్ద సింగిల్ అటాక్
- ప్రతీకారం తీర్చుకుంటామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ హెచ్చరిక - మిగతా 2 లో



హెచ్-1బీ వీసాల్లో భారీ మోసం అందుకే ఆ ఐటీ కంపెనీలపై వేటు

- హెచ్-1బీ వీసాలు దుర్వినియోగం చేస్తున్నారంటూ వాన్స్ తీవ్ర ఆరోపణలు
- ఇన్ఫోసిస్, టీసీఎస్ సహా ఆరు కంపెనీలపై నిషేధం విధించిన ట్రంప్ సర్కార్
- విదేశీ వర్కర్లకు తక్కువ జీతాలిచ్చి మోసం చేస్తున్నారని వాన్స్ విమర్శ
- అమెరికన్లతో పోలిస్తే 48,000 డాలర్ల వరకు తక్కువ వేతనాలు ఇస్తున్నారని ఆరోపణ
- వీసా ప్రోగ్రామ్‌ను సంస్కరించాలని కాంగ్రెస్‌కు వాన్స్ పిలుపు

హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్ ను దుర్వినియోగం చేస్తున్నారంటూ పలు ఐటీ కంపెనీలపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అమెరికన్ కార్పొరేషన్లు, విదేశీ ఔట్‌సోర్సింగ్ సంస్థలు కలిసి విదేశీ ఉద్యోగులను దోపిడీ చేస్తున్నాయని, వారి ద్వారా అమెరికన్ల - మిగతా 2 లో

బెంగాల్, బీహార్ తర్వాత తెలంగాణను టార్గెట్ చేస్తున్నారు

- మోదీ ప్రభుత్వంపై పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తీవ్ర ఆరోపణలు
- బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై 92 లక్షల ఓట్లు తొలగించాయని వ్యాఖ్య
- ప్రజాస్వామ్యాన్ని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఖూనీ చేస్తున్నారని ఆగ్రహం

ప్రపంచానికి 'సూపర్ డూపర్ ఎల్ నినో' ముప్పు



- ఎర్రగా మారిన భూగోళం!
- ప్రపంచవ్యాప్తంగా "సూపర్ డూపర్ ఎల్ నినో" హెచ్చరికలు
- భూగోళం దాదాపు పూర్తిగా ఎరుపు రంగులోకి మారిందన్న నిపుణులు
- పసిఫిక్ సముద్రంలో రికార్డు స్థాయిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- 2027 ఫిబ్రవరి వరకు ఎల్ నినో ప్రభావం కొనసాగే అవకాశం - మిగతా 2 లో

నానా పటేకర్ మృతిపై జూ.ఎన్టీఆర్, ప్రభుదేవా దిగ్భ్రాంతి

- గోవాలో తుదిశ్వాస విడిచిన నానా పటేకర్
- జూ.ఎన్టీఆర్, ప్రభుదేవా, ప్రకాశ్ రాజ్ సహా ప్రముఖుల సంతాపం
- ఆయన పోషించిన ప్రతి పాత్రలో నిజాయతీ, తీవ్రత స్పష్టంగా కనిపించేవన్న జూ.ఎన్టీఆర్
- పద్మశ్రీ, జాతీయ అవార్డుల గ్రహీతగా నానాకు ప్రత్యేక గుర్తింపు - మిగతా 2 లో

అమరావతి ఓఆర్ఆర్, పోలవరం బ్రిడ్జి

కేంద్రానికి చంద్రబాబు కీలక విజ్ఞప్తులు

- ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ
- అమరావతి ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణానికి పూర్తి సహకారం అందించాలని వినతి
- పోలవరం ప్రాజెక్టు వద్ద ఐకానిక్ వంతెన నిర్మించాలని ప్రతిపాదన
- రాష్ట్ర తీరప్రాంత అభివృద్ధికి బీచ్ రోడ్ ప్రాజెక్టుపై దృష్టి సారించాలని విజ్ఞప్తి

ఐటీ దిగ్గజ కంపెనీలపై అమెరికా కొరడా

గ్రీన్ కార్డు ప్రక్రియ నిలిపివేత!

- హెచ్-1బీ వీసాదారుల గ్రీన్ కార్డు ప్రక్రియపై ట్రంప్ సర్కార్ కీలక నిర్ణయం
- మైక్రోసాఫ్ట్, అడోబ్‌తో పాటు ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి భారత ఐటీ కంపెనీల సస్పెన్షన్
- పెర్మ్ సర్టిఫికేషన్ కార్యక్రమం నుంచి ఈ కంపెనీలను నిలిపివేస్తున్నట్లు ప్రకటన
- అమెరికన్ ఉద్యోగులను తొలగించి విదేశీయులను నియమించుకుంటున్నారని ఆరోపణ
- ప్రస్తుత హెచ్-1బీ వీసాలపై ప్రభావం లేదు, కానీ గ్రీన్ కార్డు దరఖాస్తులు నిలిపివేత

మొబైల్ ఫోన్ ఇప్పుడు సుపరిపాలనకు సాధనం

- దేశంలోని ప్రతీ జిల్లాకు 5జీ సేవలు విస్తరించాయన్న మోదీ
- మొబైల్ ఇంటర్నెట్ వేగం 2022తో పోలిస్తే 10 రెట్లు పెరిగిందని వెల్లడి
- డిజిటల్ ఇండియా ద్వారా సాంకేతిక అంతరాలను తగ్గించామన్న ప్రధాని
- కోవిడ్ సమయంలో డిజిటల్ వ్యవస్థ దేశాన్ని నడిపించిందని వ్యాఖ్య

భారత టెలికాం రంగం కేవలం నెట్‌వర్క్‌లు, స్పెక్ట్రమ్, ఇంటర్నెట్ వేగానికే

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం
నిలువుటద్దం
శనివారం 10-10-2026

డ్రగ్స్‌పై యుద్ధం.. సమష్టిగా కదులుదామన్న మంత్రి లోకేశ్

మొదటిపేజీ తరువాయి – రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. డ్రగ్స్ నిర్మూలనపై హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఉండవల్లిలో జరిగిన మంత్రుల బృందం సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ లక్ష్యాన్ని సాధించాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, యువతను, విద్యార్థులను డ్రగ్స్ మహమ్మారి బారి నుంచి కాపాడేందుకు బహుముఖ వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే 'ఈగల్ క్లబ్'లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో 'ఆపరేషన్ చైతన్యం', విద్యాసంస్థల సమీపంలో 'సేఫ్ క్యాంపస్ జోన్', యువత కోసం 'డ్రగ్స్ వద్దు బ్రో' వంటి కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో విద్యార్థులతో నెలకోసారి టౌన్ హాల్ సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ నివారణపై ఇతర రాష్ట్రాలతో సమన్వయం కోసం త్వరలో విశాఖపట్నంలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్ నిర్వహించాలని, సింథటిక్ డ్రగ్స్ నియంత్రణలో పంజాబ్ పోలీసుల అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ, ఒడిశా నుంచి గంజాయి రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘాను పటిష్ఠం చేశామని, డ్రోన్ల వినియోగాన్ని కూడా పెంచుతామని తెలిపారు. సమాజంలో చైతన్యం తెచ్చేందుకు 'బ్రేక్ ద సైలెన్స్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు.

ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో పట్టుబడిన గంజాయి చాక్లెట్లు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చినట్లు గుర్తించామని, ఆయా రాష్ట్రాల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయిస్తున్న 20 మెడికల్ షాపులను సీజ్ చేశామని, విజయవాడ, రాజమండ్రి నగరాల్లోని బ్లేడ్ బ్యాచ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. డ్రగ్స్ రవాణాను గుర్తించేందుకు 36 శిక్షణ పొందిన జాగిలాలను వినియోగిస్తున్నామని, రాపిడ్ డ్రగ్ డిటెక్షన్ కిట్లతో అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 192 మంది పాత నేరస్థులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, ఇంటిలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్డా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు.

నానా పటేకర్ మృతిపై జూ.ఎన్టీఆర్, ప్రభుదేవా దిగ్భ్రాంతి

మొదటిపేజీ తరువాయి – ప్రముఖ నటుడు నానా పటేకర్ మరణవార్త విన్న దేశవ్యాప్త సినీ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. జూనియర్ ఎన్టీఆర్, ప్రభుదేవా, ప్రకాష్ రాజ్, ఖుష్బూ సుందర్ వంటి దక్షిణాది తారలు ఆయనకు ఘన నివాళులర్పించారు. నానా పటేకర్ మృతి పట్ల జూనియర్ ఎన్టీఆర్ స్పందిస్తూ, "భారతీయ చలనచిత్ర రంగంలోని అత్యుత్తమ నటులలో ఒకరైన నానా పటేకర్ గారు కన్నుమూయడం తీవ్ర విచారకరం. ఆయన పోషించిన ప్రతి పాత్రలోనూ నిజాయతీ, గాఢత స్పష్టంగా ప్రతిబింబించేవి. ఆయన నటన కేవలం అభినయంలా కాకుండా, తెరపై జీవితమే ఆవిష్కృతమవుతున్నట్లుగా ఉండేది. చిత్ర పరిశ్రమకు ఆయన అందించిన సేవలు తరతరాల పాటు గుర్తుండిపోతాయి" అని పేర్కొన్నారు. ప్రభుదేవా, ప్రకాష్ రాజ్, ఖుష్బూ సైతం ఆయనతో తమకున్న అనుబంధాన్ని స్మరించుకుంటూ సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేశారు. 1951 జనవరి 1న జన్మించిన నానా పటేకర్, గత నాలుగు దశాబ్దాలుగా హిందీ, మరాఠీ, తమిళ చిత్రాల్లో తన విలక్షణ నటనతో చెరగని ముద్ర వేశారు. 'సలామ్ బాంబే', 'పరిందా', 'క్రాంతివీర్', 'అబ్ తక్ ఛప్పన్', ' రాజనీతి', 'కాలా' వంటి చిత్రాల ద్వారా ఆయన దేశవ్యాప్తంగా విశేష గుర్తింపు పొందారు. నటనలో ఆయన కనబరిచిన ప్రతిభకు గానూ మూడు జాతీయ అవార్డులతో పాటు, 2013లో పద్మశ్రీ పురస్కారం లభించింది. కేవలం నటుడిగానే కాకుండా, రైతుల సంక్షేమం కోసం చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ఆయన ఎంతో చురుగ్గా పాల్గొన్నారు.

ప్రపంచానికి 'సూపర్ డూపర్ ఎల్ నినో' ముప్పు

మొదటిపేజీ తరువాయి – ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నిపుణులు తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న 'ఎల్ నినో' అసాధారణ రీతిలో బలపడి, 'సూపర్ డూపర్ ఎల్ నినో'గా మారుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది 1950 తర్వాత సంభవించిన అత్యంత శక్తిమంతమైన ఎల్ నినోలలో ఒకటిగా నిలిచిపోవచ్చని ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) అంచనా వేసింది. మానవ ప్రేరిత వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఇది మరింత తీవ్రతరం చేస్తుందని వెల్లడించింది. పసిఫిక్ మహాసముద్రం భారీ ఎత్తున ఉష్ణాన్ని విడుదల చేస్తుండటంతో భూగోళంలోని మెజారిటీ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగనున్నాయి. వాతావరణ శాస్త్రవేత్త ర్యాన్ మాయే విడుదల చేసిన గ్లోబల్ క్లైమేట్ మ్యాప్‌లో, అమెరికా మినహా భూమి దాదాపు పూర్తిగా ఎరుపు రంగులో కనిపిస్తోంది. ఎల్ నినో ప్రస్తుతం గరిష్ఠ శక్తితో కొనసాగుతోందని, దీని ప్రభావం 2027 ఫిబ్రవరి వరకు ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు. నినో 3.4 ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3.4లీజ ఎక్కువగా నమోదయ్యాయని, ఇది గత రికార్డులన్నింటినీ అధిగమించిందని మరో వాతావరణ శాస్త్రవేత్త జీక్ హాస్‌ఫాదర్ తెలిపారు. 2026 చివరి నాటికి మధ్య, తూర్పు పసిఫిక్ ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రికార్డు స్థాయిలో 3.7లీజ మేర పెరిగే అవకాశం ఉందని డబ్ల్యూఎంఓ అంచనా వేసింది. ఎల్ నినో ప్రభావం కారణంగా ప్రపంచవ్యాప్తంగా 2027 ఫిబ్రవరి నాటికి దాదాపు 4,51,000 అదనపు మరణాలు సంభవించే ప్రమాదముందని చికాగో యూనివర్సిటీ పరిశోధకులు హెచ్చరించారు. సాధారణంగా ప్రతి రెండు నుంచి ఏడేళ్లకు ఒకసారి సంభవించే ఎల్ నినో, ప్రపంచ ఉష్ణోగ్రతలను పెంచడంతో పాటు వర్షపాత గమనంలోనూ భారీ మార్పులకు కారణమవుతుంది.

బెంగాల్, బీహార్ తర్వాత తెలంగాణను టార్గెట్ చేస్తున్నారు: మహేశ్ గౌడ్

మొదటిపేజీ తరువాయి – తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై ఏకంగా 92 లక్షల ఓట్లను తొలగించాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉండటానికి మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ప్రజలు ఇప్పటికైనా మేల్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. లోక్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మహేశ్ గౌడ్ మండిపడ్డారు. దేశవ్యాప్తంగా యథేచ్ఛగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. "బీహార్, పశ్చిమ బెంగాల్ తర్వాత ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం తెలంగాణను టార్గెట్ చేసింది. మోదీ, అమిత్ షా పాలనలో గత 12 ఏళ్లలో ప్రజలకు ఏమైనా మేలు జరిగిందా అని ఆలోచించుకోవాలి" అని ఆయన అన్నారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగానే నిరసన తెలుపుతున్నామని స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన్ను పదవి నుంచి తొలగించే వరకు తమ ఉద్యమం ఆగదని తేల్చి చెప్పారు. మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును దేశ ప్రజలు గమనిస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఉక్రెయిన్‌పై రష్యా రాకెట్ దాడి.. బస్టాప్‌లో 33 మంది పౌరుల మృతి

మొదటిపేజీ తరువాయి – ఉక్రెయిన్‌పై రష్యా మరోమారు క్షిపణి దాడులతో విరుచుకుపడింది. తూర్పు ఉక్రెయిన్‌లోని క్రమటోర్స్క్ పట్టణంలో రద్దీగా ఉన్న ఒక బస్టాప్‌పై జరిగిన రాకెట్ దాడిలో 33 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో 18 మంది తీవ్రంగా గాయపడగా, ఈ ఘోర దుర్ఘటనతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. ఈ దాడి ధాటికి బస్టాప్ పరిసరాలన్నీ రక్తసిక్తమయ్యాయి. మృతదేహాలు, శిథిలాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయి. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రులకు తరలించాయి. ఈ ఏడాదిలో రష్యా జరిపిన దాడుల్లో పౌరులు ఇంత పెద్ద సంఖ్యలో మరణించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ దాడిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ తీవ్రంగా స్పందించారు. రష్యా ఉద్దేశపూర్వకంగానే పౌరులను లక్ష్యంగా చేసుకుని ఈ ఘాతుకానికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. "ఇది ముమ్మాటికీ ఉగ్రవాద చర్య. దీనికి తగిన ప్రతీకారం తీర్చుకుంటాం" అని ఆయన హెచ్చరించారు. అమాయక ప్రజల ప్రాణాలను బలిగొంటున్న రష్యాపై అంతర్జాతీయ సమాజం ఒత్తిడి పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఘటనతో ఇరు దేశాల మధ్య యుద్ధ ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరాయి.

అమరావతి ఓఆర్ఆర్, పోలవరం బ్రిడ్జి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి అత్యంత కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు, నిధులు, అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ ఆయన విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ప్రధానంగా, రాజధాని అమరావతి అభివృద్ధికి గుండెకాయ వంటి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దాదాపు 189 కిలోమీటర్ల పొడవుతో ప్రతిపాదించిన ఈ ఓఆర్ఆర్, రాజధాని ప్రాంత అభివృద్ధిలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందని ముఖ్యమంత్రి వివరించారు. అమరావతి, విజయవాడ పరిసర ప్రాంతాల్లో భవిష్యత్తులో పెరిగే రవాణా అవసరాలను తీర్చడంలో ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమని ఆయన కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దోహదపడే మరికొన్ని కీలక ప్రాజెక్టులను కూడా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాష్ట్ర జీవనాధారమైన పోలవరం ప్రాజెక్టు వద్ద ఎడమ, కుడి గట్లను అనుసంధానిస్తూ ఒక 'ఐకానిక్' వంతెన నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు. ప్రాజెక్టుకు అనుబంధంగా అవసరమైన రహదారులు, ఇతర వంతెనల నిర్మాణానికి సైతం కేంద్రం తోడ్పాటునందించాలని విన్నవించారు. రాష్ట్ర తీరప్రాంత అభివృద్ధికి, పర్యాటక, పారిశ్రామిక కనెక్టివిటీని పెంచేందుకు బీచ్ రోడ్ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించాలని చంద్రబాబు కోరారు. ఈ రహదారి నిర్మాణం ద్వారా తీరప్రాంత నగరాలు, ఓడరేవులు, పర్యాటక కేంద్రాల మధ్య అనుసంధానం మరింత మెరుగుపడుతుందని ఆయన వివరించారు.

ఐటీ దిగ్గజ కంపెనీలపై అమెరికా కొరడా

అమెరికాలో పనిచేస్తున్న వేలాది మంది విదేశీ ఉద్యోగులకు, ముఖ్యంగా భారతీయులకు ట్రంప్ ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. హెచ్-1బీ వీసాలపై పనిచేస్తున్న ఉద్యోగులకు శాశ్వత నివాసం (గ్రీన్ కార్డు) కల్పించే ప్రక్రియలో కీలకమైన 'శాశ్వత కార్మిక ధ్రువీకరణ (పెర్మ్)' కార్యక్రమం నుంచి మైక్రోసాఫ్ట్, అడోబ్‌తో పాటు పలు భారత ఐటీ దిగ్గజ కంపెనీలను సస్పెండ్ చేస్తున్నట్టు గురువారం ప్రకటించింది. ఈ జాబితాలో కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, క్యాప్‌జెమినీ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి. ఈ నిర్ణయంతో అమెరికా కార్మిక శాఖ ఇకపై ఈ కంపెనీల నుంచి కొత్త పెర్మ్ దరఖాస్తులను స్వీకరించదు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలించదు. అయితే, ఈ చర్యల ప్రభావం ప్రస్తుత హెచ్-1బీ వీసాలపై ఉండదని, కేవలం గ్రీన్ కార్డు మంజూరు ప్రక్రియపైనే ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ కంపెనీలలో పనిచేస్తున్న విదేశీయులు గ్రీన్ కార్డు పొందడం ఇకపై దాదాపు అసాధ్యంగా మారనుంది. ఈ సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడుతూ, ముఖ్యంగా మైక్రోసాఫ్ట్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. "అమెరికాలో ఈ వ్యవస్థను మైక్రోసాఫ్ట్ కంటే ఎక్కువగా ఎవరూ దుర్వినియోగం చేయలేదు. ఆ సంస్థ సుమారు 6,000 మంది అమెరికన్ ఉద్యోగులను తొలగించి, దాదాపు 6,300 హెచ్-1బీ వీసాలు, 3,000 గ్రీన్ కార్డులు పొందింది. ఇది అమెరికన్ల స్థానంలో విదేశీ బానిసలను నియమించుకోవడమే" అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు.

ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలో పాల్గొన్న సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి – వ్యతిరేకంగా మారడంతో ఆ పార్టీ భయపడుతోందని, అందుకే వారి ఓట్లను దొంగిలించాలని చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో రేవంత్ రెడ్డి వరుసగా రెండో రోజు పాల్గొన్నారు. గురువారం రాజ్‌ఘాట్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలతో కలిసి ఆయన ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో రేవంత్ రెడ్డి బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో భారతీయులను విభజించడానికి బీజేపీ ప్రయత్నించింది. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు, సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేసింది. ఇప్పుడు ఓటమి ఖాయమని తేలడంతో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. సుమారు 13 కోట్ల మంది పౌరుల ఓట్లను తొలగిస్తే, అది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణ ప్రక్రియ అవుతుందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "1952 నుంచి జరిగిన ప్రతి ఎన్నికలో ఓటర్ల సంఖ్య పెరిగింది. కానీ ఇప్పుడు, రాబోయే ఎన్నికల్లో దేశంలో మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గే విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తున్నారు. అయితే, దీనికి భారత ప్రజలు అంగీకరించరు," అని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ లేదా ఇండియా కూటమిది మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించినదని ఆయన అన్నారు. బ్రిటిష్ వారి 'విభజించు-పాలించు' ఎత్తుగడలతో ప్రధాని మోదీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. "ఈ రోజు ప్రజల ఓట్లను చట్టవిరుద్ధంగా లాక్కుంటే, రేపు వారి రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులను కూడా లాక్కుంటారు. బీజేపీ వెంటనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ప్రతి పౌరుడి ఓటు హక్కును పునరుద్ధరించాలి. లేదంటే ఆ పార్టీ భారత రాజకీయ చరిత్రలో చెత్తబుట్టలో కలిసిపోతుంది," అని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

మొబైల్ ఫోన్ ఇప్పుడు సుపరిపాలనకు సాధనం

మొదటిపేజీ తరువాయి – పరిమితం కాలేదని, సుపరిపాలన, ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో మొబైల్ కనెక్టివిటీ ఒక కీలక శక్తిగా ఆవిర్భవించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. నేడు ఢిల్లీలో ప్రారంభమైన 10వ 'ఇండియా మొబైల్ కాంగ్రెస్' (ఐఎంసీ) 2026 సదస్సును ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గత దశాబ్ద కాలంలో మొబైల్ ఫోన్లు సాధారణ కమ్యూనికేషన్ పరికరాల స్థాయి నుంచి సుపరిపాలనను అందించే ముఖ్యమైన సాధనాలుగా రూపాంతరం చెందాయని అన్నారు. 'మొబైల్ ఫోన్ ఇప్పుడు సుపరిపాలనకు ఒక సాధనంగా మారింది' అని ఆయన పేర్కొన్నారు. భారత టెలికాం ప్రస్థానంలో ఇండియా మొబైల్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని ప్రధాని గుర్తుచేశారు. "2022లో ఇదే వేదికపై దేశంలో 5జీ సేవలను ప్రారంభించాం. 2023 నాటికి 5జీని దేశవ్యాప్తంగా విస్తరింపజేయడంలో ముందడుగు వేశాం. ఈ రోజు దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ కనెక్టివిటీ చేరింది. ప్రస్తుతం దేశంలో 5.5 లక్షలకు పైగా 5జీ బేస్ స్టేషన్లు పనిచేస్తున్నాయి. 2022తో పోలిస్తే మొబైల్ ఇంటర్నెట్ వేగం 10 రెట్లు పెరిగింది" అని ప్రధాని వివరించారు. ఒక దశాబ్దం క్రితం దేశంలో 'డిజిటల్ విభజన' ఒక పెద్ద సవాలుగా ఉండేదని, కొత్త సాంకేతికత కొందరికే దక్కేదని మోదీ గుర్తుచేశారు. ఈ సమస్యను అధిగమించేందుకే 'డిజిటల్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించామని, మొబైల్ ఫోన్‌ను కేంద్రంగా చేసుకుని డిజిటల్ సేవలను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చామని వివరించారు. భారతీయులకు టెలికాం అంటే కేవలం సాంకేతికత మాత్రమే కాదని, అంతకు మించి అని ఆయన అన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో భారత డిజిటల్ వ్యవస్థ ప్రాముఖ్యతను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో కార్యకలాపాలు స్తంభించిపోయినప్పుడు కూడా, మన దేశంలో కార్యాలయాలు, బ్యాంకులు, విద్యా సంస్థలు డిజిటల్ మౌలిక సదుపాయాల వల్లే నిరంతరాయంగా పనిచేయగలిగాయని గుర్తుచేశారు. ఈ ఏడాది ఐఎంసీ థీమ్ 'సరిహద్దులు లేని విస్తరణ' (గ్రాఖుశ్రీవ ఔజ్‌ప్రశీబ్ దీశీబఅఝతీఅవం) అని, ఇది భారత టెలికాం, డిజిటల్ మౌలిక సదుపాయాల ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుందని మోదీ అన్నారు. అక్టోబర్ 7 నుంచి 10 వరకు జరగనున్న ఈ సదస్సును టెలికమ్యూనికేషన్స్ విభాగం, సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఓఏఐ) సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన దేశ, విదేశీ టెలికాం ఆపరేటర్లు, పరిశ్రమల అధిపతులు, నిపుణులు, స్టార్టప్ ప్రతినిధులకు ప్రధాని స్వాగతం పలికారు.



తెలంగాణలో మండుతున్న ఎండలు.. పలుచోట్ల 37 డిగ్రీల ఉష్ణోగ్రత

మొదటిపేజీ తరువాయి – కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు కాగా, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించిది. రుతుపవనాల నిష్క్రమణ ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనుదిరిగాయని, శుక్రవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఇవి పూర్తిగా నిష్క్రమిస్తాయని అధికారులు వివరించారు. దీని ప్రభావంతో రానున్న కొద్దిరోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

హెచ్-1బీ వీసాల్లో భారీ మోసం
అందుకే ఆ ఐటీ కంపెనీలపై వేటు: జేడీ వాన్స్ ఫైర్

మొదటిపేజీ తరువాయి – జీతాలను దెబ్బతీస్తూ, వారి ఉద్యోగాలను విదేశీయులతో భర్తీ చేస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఇది విస్తృత స్థాయిలో జరుగుతున్న ఇమ్మిగ్రేషన్ మోసమని ఆయన అభివర్ణించారు. హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్‌ను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు ట్రంప్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిబంధనలను కఠినతరం చేసి, అమెరికన్ వర్క్‌ఫోర్స్‌లో అందుబాటులో లేని అసాధారణ నైపుణ్యాలు ఉన్నవారినే విదేశాల నుంచి నియమించుకునేలా చూస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, వాన్స్ వ్యాఖ్యలకు బలం చేకూరుస్తూ ట్రంప్ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. భారత్‌కు చెందిన ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), విప్రో, హెచ్‌సీఎల్‌తో పాటు కాగ్నిజెంట్, క్యాప్‌జెమినీ వంటి ఆరు ప్రధాన ఔట్‌సోర్సింగ్ కంపెనీలను పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ కార్యక్రమం నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ కంపెనీల నుంచి కొత్తగా వచ్చే పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ దరఖాస్తులను స్వీకరించడం, పెండింగ్‌లో ఉన్నవాటిని ప్రాసెస్ చేయడం నిలిపివేస్తున్నట్లు కార్మిక శాఖ కార్యదర్శి కీత్ సోండర్‌లింగ్ తెలిపారు.

విదేశీ ఉద్యోగులు బానిసలుగా మారుతున్నారు

జేడీ వాన్స్ మాట్లాడుతూ, "అత్యంత ప్రతిభావంతులను, అమెరికాలో భర్తీ చేయలేని ఉద్యోగాల కోసం విదేశీయులను తీసుకురావడానికి హెచ్-1బీ ప్రోగ్రామ్‌ను ఉద్దేశించారు. కానీ దురదృష్టవశాత్తు, కొన్ని దశాబ్దాలుగా ఈ కార్యక్రమం మోసపూరితంగా మారింది" అని ఆరోపించారు. ఔట్‌సోర్సింగ్ సంస్థలు, అమెరికన్ కంపెనీలు కలిసి అమెరికన్ల కంటే తక్కువ జీతాలకు విదేశీ ఉద్యోగులను నియమించుకోవడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వాన్స్ విమర్శించారు. "ఈ వీసా మోసంలో అమెరికన్ కార్పొరేషన్ల కన్నా ఈ విదేశీ సంస్థలదే ఎక్కువ బాధ్యత. హెచ్-1బీ వీసాపై వచ్చిన ఉద్యోగులు, అదే స్థాయి అమెరికన్ ఉద్యోగుల కన్నా ఏటా సుమారు 20,000 డాలర్లు తక్కువ సంపాదిస్తున్నారు. అదే విదేశీ ఔట్‌సోర్సింగ్ సంస్థల ద్వారా వస్తే, ఆ వ్యత్యాసం 48,000 డాలర్లకు చేరుకుంటోంది" అని ఆయన వివరించారు. యజమానులు విదేశీ ఉద్యోగుల బలహీనతను ఆసరాగా చేసుకుంటున్నారని వాన్స్ అన్నారు. ఉద్యోగం కోల్పోతే అమెరికాలో ఉండే అవకాశం ప్రమాదంలో పడుతుందనే భయంతో ఉద్యోగులు యజమానుల చేతిలో కీలుబొమ్మలుగా మారుతున్నారని, వారిని "విదేశీ బానిసలు"గా వాడుకుంటూ లేబర్ ఖర్చులను తగ్గించుకుంటున్నారని ఆయన ఆరోపించారు. మైక్రోసాఫ్ట్ సంస్థ 6,000 మంది అమెరికన్ ఉద్యోగులను తొలగించి, అదే సమయంలో 6,300 హెచ్-1బీ వీసాలు, దాదాపు 3,000 గ్రీన్ కార్డుల ద్వారా లబ్ధి పొందిందని ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు. వీసా దరఖాస్తుల్లో కంపెనీలు తప్పుడు సమాచారం ఇస్తున్నాయని, సాధారణ ఉద్యోగాలకు కూడా అత్యంత ప్రత్యేక నైపుణ్యాలు అవసరమని చూపిస్తున్నాయని, ఇదే అసలైన మోసమని వాన్స్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో హెచ్-1బీ దరఖాస్తుల ఫీజులను పెంచడాన్ని ఆయన సమర్థించారు. నిజంగా ప్రతిభావంతులు కావాలనుకునే కంపెనీలు ఎక్కువ చెల్లించడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. ఎలాన్ మస్క్, ఏఎండీ సీఈవో లిసా సూ వంటి ప్రతిభావంతులను అమెరికా స్వాగతిస్తుందని, కానీ అమెరికన్ల ఉద్యోగాలను దెబ్బతీసే వారిని కాదని తెలిపారు. ప్రస్తుత అధికారాలతోనే మోసాలను అరికడతామని, అదే సమయంలో హెచ్-1బీ ప్రోగ్రామ్‌లో సంస్కరణలు తీసుకురావాలని కాంగ్రెస్‌ను కోరారు.

రైతులకు బేడీలా?: కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి – పంటలు కాపాడుకునేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ఇది ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని, అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' ఖాతా వేదికగా స్పందించారు. "కళ్ల ముందే ఎండుతున్న పంటలకు నీరివ్వమని అడిగిన రైతులపై కేసులు పెట్టడం సిగ్గుచేటు. రేవంత్ రెడ్డి పాలనలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారింది" అని హరీశ్ రావు విమర్శించారు. వారి చేతగానితనం వల్ల పంటలకు నీరందకపోతే, కడుపు మండి నిలదీసిన రైతులపై అక్రమ కేసులు బనాయిస్తారా? అని ప్రశ్నించారు. కృష్ణాలో నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నీటిని లిఫ్ట్ చేయకుండా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించి, ఇప్పుడు రైతులను శిక్షిస్తున్నారని ఆరోపించారు."ఇది ప్రజా పాలన కాదు. ప్రజా పీడన. తప్పు ప్రభుత్వం చేస్తే శిక్ష రైతులు అనుభవించాలా?" అని హరీశ్ రావు నిలదీశారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నిష్పలాంటి నిజాల ప్రతిబింబం
నిలువుటద్దం
శనివారం 10-10-2026

JNTUH వీసీకి విద్యార్థుల బాసట
విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను కాపాడేందుకు ఐక్యగళం!

వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం తగదు..

మహిళా సాధికారతకు జేఎన్టీయూ కట్టుబడి ఉంది

వైస్ ఛాన్సలర్‌పై జరుగుతున్న ప్రచారాన్ని ఖండించిన

పరిశోధక విద్యార్థి చల్ల రామకృష్ణ రెడ్డి.....

హైదరాబాద్, అక్టోబర్ 9 (నిలువుటద్దం ప్రతినిధి): జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (జేఎన్టీయూ) వైస్ ఛాన్సలర్ ప్రతిష్ఠను, విశ్వవిద్యాలయ గౌరవాన్ని దెబ్బతీసేలా జరుగుతున్న ప్రచారంపై జేఎన్టీయూ విద్యార్థులు స్పందించారు. పూర్తి వాస్తవాలను తెలుసుకోకుండా వ్యక్తులపై, విద్యాసంస్థలపై ఆరోపణలు చేయడం సమంజసం కాదని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయ అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల పెంపునకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయంలో వివాదాస్పద ప్రచారాలకు బదులుగా వాస్తవాల ఆధారంగా చర్చ జరగాలని కోరారు. ఈ మేరకు పరిశోధక విద్యార్థి చల్ల రామకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు వైస్ ఛాన్సలర్‌కు తమ మద్దతు ప్రకటించారు.

కార్యక్రమానికి ఆహ్వానంపై వివాదం.. వాస్తవాలను పరిశీలించాలి

VJIT కళాశాల ప్రిన్సిపాల్, విభాగాధిపతి (హెచ్ఓడీ), విద్యార్థులు తమ కళాశాలలో నిర్వహించనున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించేందుకు జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్‌ను కలిసినట్లు తమ దృష్టికి వచ్చిందని విద్యార్థులు తెలిపారు. తన బిజీ షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకుని, వీలైతే కార్యక్రమానికి హాజరవుతానని వైస్ ఛాన్సలర్ తెలిపిన విషయాన్ని తప్పుగా అర్థం చేసుకుని వివాదానికి దారితీసేలా ప్రచారం చేయడం తగదని పేర్కొన్నారు. ఒక కార్యక్రమానికి హాజరయ్యే విషయంలో సమయాభావం, ఇతర అధికారిక బాధ్యతలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమానికి హాజరుకావడంపై వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని మహిళల పట్ల వివక్షగా చిత్రీకరించడం సమంజసం కాదని అన్నారు. ఏదైనా అంశంపై అభ్యంతరాలు ఉంటే సంబంధిత వాస్తవాలను పూర్తిగా తెలుసుకుని, ఇరుపక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఒక నిర్ధారణకు రావాలని సూచించారు.

మహిళలకు నాయకత్వ అవకాశాలు కల్పిస్తున్న JNTUH

మహిళల అభ్యున్నతి, సమాన అవకాశాలు, నాయకత్వ బాధ్యతల్లో వారి భాగస్వామ్యానికి జేఎన్టీయూ ప్రాధాన్యత ఇస్తోందని విద్యార్థులు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో మహిళా రిజిస్ట్రార్‌తో పాటు మహిళా ఆచార్యులు, ప్రొఫెసర్లు, డైరెక్టర్లు వివిధ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. మహిళలకు ఉన్నత బాధ్యతలు అప్పగించడం, వారి విద్యా ప్రతిభకు తగిన గుర్తింపు కల్పించడం వంటి అంశాలు విశ్వవిద్యాలయంలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. మహిళా సాధికారత, సమానత్వం వంటి అంశాలపై చర్చ జరగడం అవసరమే అయినప్పటికీ, ఏదైనా నిర్దిష్ట ఆరోపణపై నిర్ణయానికి రావాలంటే దానికి సంబంధించిన వాస్తవాలు, ఆధారాలను పరిశీలించడం ముఖ్యమని పేర్కొన్నారు. ఆధారాలు లేని ఆరోపణలతో వ్యక్తుల ప్రతిష్ఠకు, విద్యాసంస్థ గౌరవానికి నష్టం కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

విమర్శలకు స్వాగతం.. కానీ వాస్తవాల ఆధారంగానే స్పందన

విశ్వవిద్యాలయ అభివృద్ధికి నిర్మాణాత్మక సూచనలు చేయడం, లోపాలను ఎత్తిచూపడం, విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సహజమని చల్ల రామకృష్ణ రెడ్డి పేర్కొన్నారు. అయితే విమర్శలు వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా కాకుండా, సమస్య పరిష్కారానికి దోహదపడేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. విద్యాసంస్థలు విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేస్తాయని, వాటి గౌరవం, విద్యా వాతావరణం, పరిపాలనా వ్యవస్థపై జరిగే చర్చలు బాధ్యతాయుతంగా ఉండాలని అన్నారు. ఆరోపణలు ఎదురైనప్పుడు వాటిని పరిశీలించడం, సంబంధిత వ్యక్తుల వివరణను తెలుసుకోవడం, ఆధారాలను బట్టి స్పందించడం ద్వారా మాత్రమే సరైన అవగాహనకు రావచ్చని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయానికి సంబంధించిన అంశాలను వ్యక్తిగత వివాదాలుగా మార్చకుండా, విద్యార్థుల ప్రయోజనాలు, పరిశోధన, బోధన, మౌలిక సదుపాయాలు, విద్యా ప్రమాణాల మెరుగుదలపై దృష్టి సారించాలని కోరారు.

వీసీ నాయకత్వంలో అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్ నాయకత్వంలో విశ్వవిద్యాలయ అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం, పరిశోధన రంగానికి ప్రోత్సాహం, విద్యా ప్రమాణాల పెంపు వంటి అంశాలకు ప్రాధాన్యత లభించాలని విద్యార్థులు ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయానికి సంబంధించిన ఏ సమస్యపైనైనా చర్చించేందుకు, నిర్మాణాత్మక సూచనలు చేసేందుకు విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర వర్గాలు ముందుకు రావాలని సూచించారు. అదే సమయంలో, వాస్తవాలను నిర్ధారించుకోకుండా ప్రచారం చేయడం వల్ల విద్యార్థుల్లో అనవసరమైన గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యాసంస్థ ప్రతిష్ఠను కాపాడటం అంటే విమర్శలను అడ్డుకోవడం కాదని, విమర్శలు వాస్తవాల ఆధారంగా, బాధ్యతాయుతంగా ఉండేలా చూడటమే ముఖ్యమని తెలిపారు.

JNTUH గౌరవం, సమానత్వ విలువలకు అండగా విద్యార్థులు

తాము జేఎన్టీయూకు చెందిన బోనఫైడ్ విద్యార్థులమని పేర్కొన్న విద్యార్థులు, విశ్వవిద్యాలయ గౌరవం, అభివృద్ధి, విద్యా విలువలు, సమానత్వ స్ఫూర్తికి అండగా నిలుస్తామని ప్రకటించారు. వైస్ ఛాన్సలర్‌కు తమ మద్దతును తెలియజేస్తూ, విశ్వవిద్యాలయానికి సంబంధించిన అంశాలపై వాస్తవాల ఆధారంగా స్పందించాలని విద్యార్థి సమాజానికి విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, పరిశోధనకు అనుకూలమైన వాతావరణం, నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండటం వంటి లక్ష్యాల సాధనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత ఆరోపణలు, వివాదాల కంటే విద్యాసంస్థ పురోగతి, విద్యార్థుల సంక్షేమం, సమాన అవకాశాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: జేఎన్టీయూ బోనఫైడ్ విద్యార్థులు జయరాం, సాయిరాం, సంపత్, హర్ష, రామ్, దుర్గ, అరవింద్, విక్రమ్, శ్రీను, నితిన్, యశ్ వర్ధన్, శివ, గణేష్, వరుణ్, చందు, అర్జున్ సాయి, తోబి, నిఖిల్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపురి కాలనీలో అక్రమాలపై సీబీఐ, ఈడీతో విచారణ జరిపించాలి

కాలనీలో మిగిలిన 4 ఎకరాల భూమి కబ్జాకు గురికాకుండా కాపాడాలి

మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వెంటనే చిత్రపురి కాలనీలో అక్రమాలపై స్పందించాలి

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

టీఆర్ఎస్ చీఫ్ తో చిత్రపురి కాలనీ సాధన సమితి నాయకుల భేటీ

హైదరాబాద్ : నిలువుటద్దం ప్రతినిధి: చిత్రపురి కాలనీ సోసైటీ లో అవినీతి, అక్రమాలపై సీబీఐ, ఈడీ తో విచారణ జరిపించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా ఉన్న అనిల్ అనే వ్యక్తి.. సోసైటీలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని చెప్పారు. ఒకే వ్యక్తి ఇంత అవినీతికి పాల్పడటానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని మంత్రుల సహకారం ఉందని చెప్పారు. అనిల్ అవినీతిపై చర్యలు తీసుకుంటామని చెప్పి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. చిత్రపురి కాలనీ సాధన సమితి నాయకులతో కలిసి శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఫిల్మ్ ఫెడరేషన్ లోని అన్ని విభాగాలను చెరబట్టిన అనిల్.. ఇప్పటికీ చిత్రపురి కాలనీలో అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. సినీ కార్మికులకు మేలు చేసేందుకు అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర్ రెడ్డి, నటుడు ప్రభాకర్ రెడ్డి చిత్రపురి కాలనీకి 1994 లో 67 ఎకరాలు ఇచ్చారని గుర్తు చేశారు. వాటిలో కార్మికులకు ఇళ్లను కేటాయించే విషయానికి సంబంధించి బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లు పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని చెప్పారు. అప్పటి మంత్రుల సహకారంతో అవినీతికి పాల్పడిన అనిల్... ఇప్పుడు కాలనీలో మిగిలి ఉన్న 4 ఎకరాల భూమిపై కన్నేశారన్నారు. కో ఆపరేటివ్ సోసైటీ రూల్స్ ను తుంగలో తొక్కి ఆ భూమిని మార్టిగేజ్ పెట్టి రూ. 19 కోట్లు తీసుకున్నారన్నారు. తాజాగా ఆ భూముల్లో ఫ్లాట్లు కడుతున్నామంటూ నిసిగ్గుగా ప్రచారం చేసుకుంటున్నారంటున్నారన్నారు. ఇంత బాహాటంగా ఫ్లాట్లు కడుతున్నామంటూ అవినీతికి పాల్పడుతుంటే..కో ఆపరేటివ్ మినిస్టర్ తుమ్మల నాగేశ్వర్ రావు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే ఈ భూమి విషయంలో జోక్యం చేసుకోని ఆ భూమిని పేద సినీ కార్మికులకు ఇళ్ల నిర్మాణం కోసం ఉపయోగించాలని కోరారు.

అనిల్ ను వెంటనే తొలగించాలి

ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా ఉన్న అనిల్ ను వెంటనే తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కవిత డిమాండ్ చేశారు. ఫ్లాట్ల విషయంలోనే కాకుండా అక్కడ ఇళ్ల సముదాయాలను బట్టి కూడా రూ. 23, 10 కోట్లు అంటూ వసూళ్లకు పాల్పడ్డారన్నారు. ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ కోసం సోసైటీ వాళ్ల నుంచి 2 లక్షలు వసూలు చేశారని చెప్పారు. మళ్లీ ఆదివారం జరగనున్న సీఎం సభ కోసం మరోసారి 2 లక్షలు కావాలంటూ బెదిరిస్తున్నాడన్నారు. అదే విధంగా తోట రామకృష్ణ అనే సీనియర్ డైరెక్టర్ కు కేటాయించిన ఇల్లును వేరే వాళ్లకు అమ్మారని.. అడిగితే బాధితులను బెదిరిస్తున్నారని చెప్పారు. అయినప్పటికీ పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. ఆదివారం జరిగే సభలో ముఖ్యమంత్రి పది కోట్ల రూపాయలు కేటాయిస్తారని చెబుతున్నారని దాన్ని అనిల్ కు ఇవ్వవద్దని సూచించారు. ఆయన ద్వారా న్యాయం జరుగుతుందన్న నమ్మకం చిత్రపురి కాలనీ వాసులకు లేదని.. ఆ మొత్తాన్ని ఫిల్మ్ ఫెడరేషన్ కార్పొరేషన్ కు కేటాయించాలని కోరారు. ప్రస్తుతం చిత్రపురి కాలనీ లో భూమి విలువ ఏడు వేల కోట్లు ఉంటుందని..అలాంటి చోట ఒకే వ్యక్తి ఇంత అవినీతి చేస్తుంటే ఎందుకు శిక్ష పడటం లేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. వెంటనే అనిల్ ను ఫెడరేషన్ అధ్యక్ష పదవి నుంచి తొలగించి అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

సినీ పెద్దలు జోక్యం చేసుకోవాలి

సినీ కార్మికులు ఎంతో కష్టపడి ఇళ్లు కొనుక్కుంటే వారికి అన్యాయం జరుగుతోందని.. ఈ విషయంలో సినీ పెద్దలు చిరంజీవి, పవన్ కళ్యాణ్, సురేష్ బాబు, దిల్ రాజు లాంటి వాళ్లు జోక్యం చేసుకోవాలని కవిత కోరారు. అలాట్ మెంట్ కమిటీ లో ఉన్న కాంగ్రెస్ కు చెందిన పీవీ శ్రీనివాస్ సతీమణికి ఇళ్లు కేటాయించారని చెప్పారు. అలాట్ మెంట్ కమిటీ లో ఉన్న ఆమెకు ఇల్లు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. అదే కమిటీ లో ఉన్న సుద్దాల అశోక్ తేజ ఈ విషయంలో అక్కడ జరుగుతున్న అవినీతిని బయటకు వచ్చి చెప్పాలని కోరారు. మరో రెండేళ్లలో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని..అప్పుడు సినీ కార్మికులకు న్యాయం చేస్తామని వారికి భరోసా ఇచ్చారు. చిత్రపురి కాలనీ లో జరుగుతున్న అన్యాయంపై బాధితులతో కలిసి తాము పోరాటం చేస్తామన్నారు. కవితను కలిసిన వారిలో చిత్రపురి కాలనీ సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ కస్తూరి శ్రీనివాస్, సుదీర్ కలగర, రవీంద్ర నాథ్ ఠాగూర్, తోట హరిత, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలి

వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం చొరవ చూపాలి

జిల్లా కలెక్టర్‌కు టిజేఏ నాయకుల వినతి



అశోక్

సంగారెడ్డి నిలువుటద్దం,అక్టోబర్ 9: సంగారెడ్డి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టిజేఏ) సంగారెడ్డి జిల్లా నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు మహ్మద్ సిద్ధిక్ అహ్మద్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దేవరంపల్లి అశోక్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించి, ఇంటి స్థలాల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

జర్నలిస్టుల సేవలను గుర్తించాలి: మహ్మద్ సిద్ధిక్ అహ్మద్

ఈ సందర్భంగా టిజేఏ జిల్లా అధ్యక్షులు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు మహ్మద్ సిద్ధిక్ అహ్మద్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వృత్తిపరమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్న జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సంవత్సరాలుగా జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నప్పటికీ పలువురు జర్నలిస్టులకు సొంత ఇంటి స్థలం లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. జర్నలిస్టుల కుటుంబాలకు నివాస భద్రత కల్పించేలా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని, అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల సొంతింటి కలను నెరవేర్చాలి: దేవరంపల్లి అశోక్

TJA జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దేవరంపల్లి అశోక్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు ఎలాంటి పరిస్థితుల్లోనైనా ప్రజలకు సమాచారాన్ని అందిస్తూ సమాజ అభివృద్ధికి తమ వంతు సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల్లో చాలామంది సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో నివసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. జర్నలిస్టుల కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సంగారెడ్డి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. ఇందుకోసం అనువైన ప్రభుత్వ భూములను గుర్తించి, ప్రత్యేక హౌసింగ్ సైట్ పథకాన్ని పరిశీలించాలని సూచించారు. అర్హులైన జర్నలిస్టులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తించి, పారదర్శకంగా ఇంటి స్థలాలు కేటాయించేందుకు అవసరమైన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించి, ఇంటి స్థలాల కేటాయింపు ప్రక్రియను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని TJA నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో టిజేఏ రాష్ట్ర నాయకులు ఖలీల్ సబ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం. మహిపాల్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పి. రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ పారితోష్ పంకజ్‌కు టీఎన్జీవో నాయకుల జన్మదిన శుభాకాంక్షలు

సంగారెడ్డి, నిలువుటద్దం ప్రతినిధి: జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ ఐపీఎస్ జన్మదినం సందర్భంగా టీఎన్జీవో సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎండీ జావీద్ అలీ ఆధ్వర్యంలో నాయకులు ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కసిని శ్రీకాంత్, వెంకట్ రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, రాష్ట్ర మహిళా బాధ్యులు నిర్మల రాజకుమారి, భాస్కర్, ప్రమోద్, మోహనప్ప, జగన్, యాదవరెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు ఎండీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ ఇండియన్ ఆర్మీ అఖ్నూర్‌లో 900 మందికి పైగా రోగులకు ప్రయోజనం చేకూర్చే రెండు రోజుల 'సెహత్ మేళా' విజయవంతం

హైదరాబాద్ అక్టోబర్ 9 నిలువుటద్దం ప్రతినిధి,: అఖ్నూర్ జెకె అక్టోబర్ 8 న అట్టడుగు స్థాయి ఆరోగ్య సంరక్షణలో గణనీయమైన పురోగతిని సూచిస్తూ, పీపుల్స్ హట్ ఫౌండేషన్, ఇండియన్ ఆర్మీ సహకారంతో, సంఘ ఆడిటోరియంలోని "సెహత్ మేళా" నేపథ్యంతో సమగ్ర రెండు రోజుల మల్టీడిసిప్లినరీ వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఔట్‌రీచ్‌కు సరిహద్దు ప్రాంతం నుండి అధిక స్పందన లభించింది, స్థానిక గ్రామస్తులు, భారత ఆర్మీ వెటరన్‌లు సేవలందిస్తున్న సిబ్బందితో సహా మొత్తం 939 మంది లబ్ధిదారులను నమోదు చేశారు.సీనియర్ మిలిటరీ అధికారులతో కలిసి మెడికల్ స్టాల్స్‌ను సందర్శించిన ఇండియన్ ఆర్మీ వైట్ నైట్ కార్ప్స్ ఇ.×కార్ప్స్) జనరల్ ఆఫీసర్ కమాండింగ్ లెఫ్టినెంట్ జనరల్ మోహిత్ సేథ్ సందర్శించడం ద్వారా మెగా క్యాంప్ గౌరవించబడింది. లెఫ్టినెంట్ జనరల్ సేథ్, తృతీయ సంరక్షణ సౌకర్యాలను యాక్సెస్ చేయడంలో తరచుగా లాజిస్టికల్ అడ్డంకులను ఎదుర్కొనే ప్రత్యేక, రోగనిర్ధారణ. నివారణ ఆరోగ్య సేవలను నేరుగా గ్రామీణ ద్వారం వద్దకు తీసుకువచ్చినందుకు నిర్వాహకులు మరియు వైద్య సోదరులను అభినందించారు.పీపుల్స్ హట్ ఫౌండేషన్ డైరెక్టర్లు డాక్టర్ రోహిత్ కౌల్ డాక్టర్ రీతు కౌల్ నేతృత్వంలో, ఈ కార్యక్రమం విస్తృతమైన నిపుణుల బృందాన్ని సమీకరించింది. జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, ఆప్తాల్మాలజీ, డెంటిస్ట్రీ, పాథాలజీ, ఆయుష్, క్లినికల్ సైకాలజీ, న్యూట్రిషన్. ఈసీజీ డయాగ్నోస్టిక్స్‌తో సహా విభిన్న రంగాలలో రోగులు అక్కడికక్కడే సంప్రదింపులు పొందారు. సంప్రదింపులకు మించి, రోగులకు ఉచిత అల్లోపతి ఆయుష్ మందులు, బేస్‌లైన్ డయాగ్నస్టిక్స్ అవసరమైన నివారణ సలహాలు అందించబడ్డాయి. పీపుల్స్ హట్ ఫౌండేషన్‌లో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ లలితా శర్మ చొరవ కోసం మొత్తం సమన్వయాన్ని నిర్వహించారు.పీపుల్స్ హట్ ఫౌండేషన్ యొక్క డైరెక్టర్ సీ ఓ ఓ డాక్టర్ రీతు కౌల్ జోడించారు, "పీపుల్స్ హట్ ఫౌండేషన్‌లో మా లక్ష్యం ఎల్లప్పుడూ క్లిష్టమైన ఆరోగ్య సంరక్షణ అసమానతలను తగ్గించడం అధిక-నాణ్యత, ప్రత్యేక వైద్య సేవలను నేరుగా సరిహద్దు మరియు వెనుకబడిన వర్గాలకు అందించడంలో పాతుకుపోయింది.'సెహత్ మేళా' కోసం భారత సైన్యంతో భాగస్వామ్యం అనేది పౌర ప్రజలకు మరియు దేశం కోసం ఎంతో త్యాగం చేసిన మన గౌరవనీయులైన అనుభవజ్ఞులకు సేవ చేయాలనే మా భాగస్వామ్య సంకల్పాన్ని ప్రతిబింబిస్తుంది. దాదాపు వెయ్యి మంది లబ్ధిదారులు సకాలంలో డయాగ్నస్టిక్ స్క్రీనింగ్‌లు, మల్టీ-స్పెషాలిటీ కన్సల్టేషన్‌లు కీలకమైన ఔషధాలను ఒకే పైకప్పు క్రింద పొందడం అట్టడుగు స్థాయి జోక్యంపై మా నమ్మకాన్ని బలపరుస్తుంది. మేము వైట్ నైట్ కార్ప్స్‌కి, మా అంకితభావంతో కూడిన ఆరోగ్య సంరక్షణ భాగస్వాములకు మరియు స్వచ్ఛంద వైద్య బృందాలకు మా ప్రగాఢ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము, వారి అలసిపోని అంకితభావం ఈ విస్తృతమైన రెండు రోజుల విస్తరణను ప్రభావవంతంగా అతుకులు లేకుండా చేసింది.ప్రముఖ ప్రాంతీయ ఆరోగ్య సంరక్షణ సంస్థల సంకీర్ణం శిబిరం యొక్క బహుళ క్రమశిక్షణా పరిధిని అందించింది. జె.కే ప్రభుత్వ ఆయుష్ డైరెక్టరేట్ ద్వారా సాంప్రదాయ ఆరోగ్యం. నివారణలు అందించబడ్డాయి, వైద్య అధికారులు డాక్టర్ మనీష్ గుప్తా, డాక్టర్ సుశీల్ కుమార్ భట్, డాక్టర్ నీనా శర్మ మరియు ఫార్మసిస్ట్ శ్రీ సత్పాల్ శర్మ ప్రాతినిధ్యం వహించారు.డాక్టర్ రోహిత్ శర్మ, ఉజాలా సిగ్నస్ జేకే మెడిసిటీ నుండి సీనియర్ ఆర్థోపెడిషియన్, ప్రధాన వైద్య సిబ్బందికి నాయకత్వం వహించారు. అధునాతన ఆర్థోపెడిక్ కన్సల్టేషన్‌లను అందించారు. డాక్టర్ శిఖా భట్ నాయకత్వంలో భగవాన్ గోపీనాథ్ జీ ట్రస్ట్ హాస్పిటల్ ద్వారా దంత వైద్య సేవలు అందించబడ్డాయి, అయితే ఫోర్టిస్ ఎస్కార్ట్స్ అమృత్‌సర్ డాక్టర్ ప్రియాంక శర్మ నేతృత్వంలోని ప్రత్యేక వైద్య నైపుణ్యాన్ని అందించింది. ధీరజ్ సింగ్ సమన్వయంతో అందించబడింది. రోగనిర్ధారణ పరీక్షలకు మెట్రోపాలిస్ రోష్ని మన్హాస్ నేతృత్వంలోని డాక్టర్ లాల్ పాత్‌ల్యాబ్స్ మద్దతునిచ్చాయి, అలాగే నౌరిష్‌కు చెందిన డాక్టర్. అస్మా చౌదరి అందించే క్లినికల్ న్యూట్రిషన్ కౌన్సెలింగ్. సమగ్ర కంటి సంరక్షణను గరిష్టంగా చేరుకోవడానికి రెండు రోజుల పాటు విభజించబడింది. 1వ రోజు నేత్ర మూల్యాంకనాలను షార్ప్ సైట్ ఐ హాస్పిటల్ జమ్మూ నిర్వహించింది, దీనిని శ్రీ చేతన్ శర్మ, దీపక్ శర్మ, రాహుల్ కుమార్, ఆప్టోమెట్రిస్ట్ శ్రీమతి కుల్బీర్ కౌర్ మరియు కంటి సాంకేతిక నిపుణుడు విశాల్‌లతో కలిసి నిర్వహించేవారు. 2వ రోజు కంటి సంరక్షణ సేవలను డాక్టర్ ఓం ప్రకాష్ ఐ ఇన్‌స్టిట్యూట్ అమృత్‌సర్ నుండి సీనియర్ నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ ఆర్. కె. మెంగి ఆపరేషన్స్ మేనేజర్ మిస్టర్ రిషి శర్మ నేతృత్వంలోని ప్రత్యేక బృందం అందించింది.ఆప్టోమెట్రిస్ట్‌లు నజీర్ హుస్సేన్ దార్ మరియు రిత్విక్ సెహగల్‌తో పాటు క్లినికల్ సపోర్ట్ స్టాఫ్ మద్దతు ఇచ్చారు. డిఫెన్స్ వెటరన్స్‌కు మద్దతుగా ఒక సమిష్టి ప్రయత్నంలో, పీపుల్స్ హట్ ఫౌండేషన్‌తో కలిసి ఉజాలా సిగ్నస్ జేకే మెడిసిటీ, షార్ప్ సైట్ ఐ హాస్పిటల్ మరియు డాక్టర్ ఓం ప్రకాష్ ఐ ఇన్‌స్టిట్యూట్ అమృత్‌సర్‌లు సంయుక్తంగా ఎక్స్-సర్వీస్‌మెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ సర్వీస్ వింగ్‌ను స్థాపించారు. సివిల్-మిలిటరీ హెల్త్‌కేర్ భాగస్వామ్యానికి గ్రామ పెద్దలు.స్థానిక అనుభవజ్ఞుల హృదయపూర్వక కృతజ్ఞతా భావాలతో పాటు, సీనియర్ ఇండియన్ ఆర్మీ అధికారులు పాల్గొనే వైద్య బృందాలను అధికారికంగా సత్కరించడంతో రెండు రోజుల హెల్త్ డ్రైవ్ ముగిసింది

గీత భూపాల్ రెడ్డి కళాశాలలో బతుకమ్మ సంబరాలు



రామచంద్రాపురం నిలువుటద్దం ప్రతినిధి: మయూరి నగర్‌లోని శ్రీ గీత భోపాల్ రెడ్డి జూనియర్ కళాశాలలో యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు రామచంద్రాపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం
నిలువుటద్దం
శనివారం 10-10-2026

కూకట్‌పల్లి నియోజకవర్గం మైనారిటీ ఛైర్మన్‌గా నియమితులైన చున్ను పాషాకు జాతీయ మానవ హక్కుల న్యాయవాది శ్రీ మున్నా అభినందనలు తెలిపారు

హైదరాబాద్, అక్టోబర్ 9, 2026: మహ్మద్ చున్ను పాషా భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గం మైనారిటీ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. అక్టోబర్ 7, 2026 తేదీన జారీ చేసిన ఈ నియామక పత్రాన్ని మెద్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మైనారిటీ ఛైర్మన్ మీర్జా అజీజుల్లా బేగ్ జారీ చేశారు. చున్ను పాషాను ఆయన కొత్త బాధ్యతల సందర్భంగా అభినందిస్తూ, మానవ హక్కుల న్యాయవాది మరియు వీఐపీ మానవ హక్కుల సంఘం జాతీయ డైరెక్టర్ అయిన శ్రీ మున్నా, ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చున్ను పాషా మైనారిటీల సంక్షేమం, సామాజిక అభివృద్ధి, సామాజిక న్యాయం మరియు ప్రజా సేవ కోసం కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మహ్మద్ సమీ (కూకట్‌పల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు), జుబేర్, మన్మథ రావు, ఫసియుద్దీన్ (చాచా), నజీర్, మోయిన్ మరియు అక్బర్‌లతో కలిసి చున్ను పాషాకు తమ అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన కొత్త పాత్ర సంస్థాగత కార్యకలాపాలను బలోపేతం చేయడానికి మరియు కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మైనారిటీ వర్గాల సమస్యలను పరిష్కరించడానికి అవకాశాలను కల్పిస్తుందని శ్రేయోభిలాషులు విశ్వాసం వ్యక్తం చేశారు. శ్రీ మున్నా, చున్ను పాషా తన కొత్త బాధ్యతలలో గొప్ప విజయం సాధించాలని మరియు ప్రజా సేవ, సమాజ సంక్షేమానికి అంకితమైన విజయవంతమైన పదవీకాలాన్ని కలిగి ఉండాలని ఆకాంక్షించారు.

బిఆర్ఎస్ పార్టీ నూతన పట్టణ అధ్యక్షులుగా పెరుక భాగ్యరెడ్డి

పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం నూతన కమిటీ సభ్యులు

అందరిని కలుపుకొని సమన్వయంతో పనిచేయాలి మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్

హుస్నాబాద్, నిలువుటద్దం ప్రతినిధి : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నియోజకవర్గ కేంద్రమైన హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో భారత రాష్ట్ర సమితి పార్టీ పట్టణ కమిటీని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీని పట్టణ స్థాయిలో మరింత బలోపేతం చేయడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం లక్ష్యంగా నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ తెలిపారు. నూతన కమిటీలో పట్టణ అధ్యక్షులుగా పెరుక భాగ్యరెడ్డి, జనరల్ సెక్రటరీగా చిత్తారి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా ఇంద్రాల సారయ్య, కమిటీ సభ్యులుగా భూక్యా లక్ష్మణ్ నాయక్, దకూరి భూపతిరెడ్డి, కూతటి విజయభాస్కర్, భోజ్జ హరీష్ లను నియమించారు. అనంతరం నూతన కమిటీ నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, బీఆర్ఎస్ పార్టీ ఆశయాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని సమన్వయంతో పనిచేస్తూ, హుస్నాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీకి మరింత బలాన్ని చేకూర్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో 'సేవ్ అవర్ ఓట్స్' కార్యక్రమం

సంగారెడ్డి , నిలువుటద్దం ప్రతినిధి: రాహుల్ గాంధీ చేపట్టిన ఓటు హక్కు పరిరక్షణ పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డిలో 'సేవ్ అవర్ ఓట్స్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల పేర్లు, పోలింగ్ బూత్ నంబర్లు, సందేశాలతో కూడిన వినతులను బ్యాలెట్ బాక్స్‌లో సేకరించారు. సేకరించిన ఓటరు కార్డులు, వినతులను రాష్ట్రపతికి పంపించనున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు. ఓటు హక్కుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓట్ల తొలగింపుపై ఆయన చేసిన ఆరోపణలను సంబంధిత అధికారులు ధృవీకరించాల్సి ఉంది.

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ప్రసన్నకుమార్.. ఘన సన్మానం!

పార్టీకి చేసిన సేవలకు తగిన గుర్తింపు.. నూతన బాధ్యతలపై హర్షం......

కూకట్‌పల్లి నిలువుటద్దం ప్రతినిధి అక్టోబర్ 9: కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన మట్టే ప్రసన్నకుమార్‌కు కాలనీ సంక్షేమ సంఘం, కమిటీ సభ్యులు ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్‌ను శాలువాతో సత్కరించి, నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గత కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి ప్రసన్నకుమార్ అందిస్తున్న విశేష సేవలను గుర్తించిన పార్టీ అధిష్ఠానం ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించిందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధత, అంకితభావానికి ఈ నియామకం గుర్తింపుగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. నూతన బాధ్యతలతో నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు, అన్ని వర్గాల ప్రజలను కలుపుకుపోతూ ముందుకు సాగేందుకు మంచి అవకాశం లభించిందని తెలిపారు. ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపునిస్తూ, పార్టీ అభివృద్ధితో పాటు సమాజ సేవకు ప్రాధాన్యతనిస్తూ ప్రసన్నకుమార్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం, కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, నరేష్ కుమార్, అశోక్ ముదిరాజ్ తదితరులు పాల్గొని ప్రసన్నకుమార్‌కు అభినందనలు తెలిపారు.

భీం ఆర్మీ ఆధ్వర్యంలో కాన్షీరాంకు ఘన నివాళి

జహీరాబాద్ , అక్టోబరు 9 నిలువుటద్దం: జహీరాబాద్ నియోజకవర్గం లో మహనీయులు మాన్యవర్ కాన్షీరామ్ 20వ వర్ధంతి సందర్భంగా భీమ్ ఆర్మీ జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ అలీమ్ ఆధ్వర్యంలో కాన్షీరామ్ కు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ (భారత్ ఏక్తా మిషన్) అధ్యక్షులు సిద్దు రావణ్ మాట్లాడుతూ బహుజనుల చైతన్యానికి బాటలు వేసిన మహనీయుడని , సామాజిక మార్పుకు స్ఫూర్తి ప్రదాత అని అధికారం లేని సమాజానికి ఆత్మగౌరవం, సమానత్వం సాధించడం కష్టసాధ్యమని రాజకీయ చైతన్య సందేశాన్ని బహుజనులలో విస్తరించిన దర్శనీకుడు. అంబేద్కర్ గారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బహుజన సమాజంలో హక్కుల పట్ల అవగాహన పెంపొందించి కుల వివక్షతకు వ్యతిరేకంగా అణగారిన వర్గాల హక్కుల కోసం సమాన అవకాశాల సాధన కోసం నిరంతరం కృషి చేసిన పోరాటయోధుడని తెలియజేశారు. కాన్షి రామ్ గారు మన మధ్య భౌతికంగా లేకపోయినా ఆయన నాటిన బహుజన చైతన్య బీజాలు తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయన్నారు. కాన్షీరామ్ మ ఆశయాల సాధనే మన నిజమైన నివాళి అని ఆయన అన్నారు. బహుజన ఐక్యత , సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల పరిరక్షణే భీమ్ ఆర్మీ ముందున్న కర్తవ్యమని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సుభాష్ బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ధనరాజ్ బాబ్రాజ్ విజయ్ కుమార్, అనంతరం ,రాకేష్ మామయ్య, నరసింహులు ముదిరాజ్ ,ప్రేమ్ కుమార్ , పండరి, రాచన్న చంద్రయ్య, బలరాం, గోపాల్, గౌతమ్ కృష్ణ, జైపాల్, రామ్ చందర్, తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జహీరాబాద్ టౌన్ సీఐ రవి

జహీరాబాద్, నిలువుటద్దం: సంగారెడ్డి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ పరితోష్ పంకజ్ కు జహీరాబాద్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. రవి శుక్రవారం హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అయన చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా సీఐ ఆర్. రవి మాట్లాడుతూ, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మరింత చేరువగా పోలీసు సేవలు అందించడంలో ఎస్పీ పరితోష్ పంకజ్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఆయన సమర్థవంతమైన నాయకత్వంలో సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ ప్రజల భద్రతకు మరింత అంకితభావంతో పనిచేస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎస్పీ పరితోష్ పంకజ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, దీర్ఘాయుష్షుతో జీవించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు, పోలీస్ శాఖకు మరింత సేవలందించాలని భగవంతుడిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు సీఐ ఆర్. రవి తెలిపారు.

బాయికాడి విజయ్‌కు మాద్రి పృథ్వీరాజ్ జన్మదిన శుభాకాంక్షలు

పటాన్చెరు, నిలువుటద్దం ప్రతినిధి: పటాన్‌చెరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాయికాడి విజయ్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు, ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాసేవలో ముందుకు సాగుతున్న విజయ్ మరిన్ని విజయాలు సాధించాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పృథ్వీరాజ్ ఆకాంక్షించారు.

గృహ ప్రవేశం రోజు అస్సలే ఈ తప్పులు చేయకూడదంట చేస్తే అంతే ఇక

వ్యక్తులపై, కుటుంబంపై వాస్తు అనేది చాలా ఎఫెక్ట్ చూపిస్తుంటుంది. అందుకే వాస్తు బాగుండేలా చూసుకోవాలని చెబుతుంటారు. లేకపోతే చాలా కష్టాలు నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. వాస్తు శాస్త్ర నియమాలు సరిగ్గా పాటిస్తే మంచి ఫలితాలు పొందడమే కాకుండా, చాలా శుభప్రదంగా కూడా ఉంటుంది. కాబట్టి పండితులు తప్పకుండా వాస్తు నియమాలు పాటించాలని చెబుతుంటారు. ముఖ్యంగా కొత్తగా ఇల్లు నిర్మించుకునే సమయంలో లేదా, కొత్త ఇంట్లోకి గృహ ప్రవేశం చేయబోతున్న సమయంలో చాలా జాగ్రత్తగా వాస్తు నియమాలు పాటించాలంట. లేకపోతే మీరు చేసే ఈ చిన్న తప్పులే భవిష్యత్తులో మీ ఇంటి ఆనందాన్ని, శ్రేయస్సును దూరం చేసే అవకాశం ఉండటమే కాకుండా, అనేక ఆర్థిక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందంట. అందుకే అసలు గృహ ప్రవేశం చేస్తున్నప్పుడు ఎలాంటి తప్పులు చేయకూడదో ఇప్పుడు తెలుసుకుందాం. ముఖ్యంగా కొత్తగా ఇల్లు నిర్మించుకునే సమయంలో లేదా, కొత్త ఇంట్లోకి గృహ ప్రవేశం చేయబోతున్న సమయంలో చాలా జాగ్రత్తగా వాస్తు నియమాలు పాటించాలంట. లేకపోతే మీరు చేసే ఈ చిన్న తప్పులే భవిష్యత్తులో మీ ఇంటి ఆనందాన్ని, శ్రేయస్సును దూరం చేసే అవకాశం ఉండటమే కాకుండా, అనేక ఆర్థిక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందంట. అందుకే అసలు గృహ ప్రవేశం చేస్తున్నప్పుడు ఎలాంటి తప్పులు చేయకూడదో ఇప్పుడు తెలుసుకుందాం.

1 / 5

గృహ ప్రవేశం చేస్తున్న వారు వాస్తు శాస్త్రం ప్రకారం ఆ రోజు నీలి రంగు దుస్తులు లేదా నలుపు రంగు దుస్తులను అస్సలే ధరించకూడదంట. వాస్తు శాస్త్రం ప్రకారం గృహ ప్రవేశం రోజు ఈ రంగు దుస్తులు ధరించడం శుభ ప్రదం కాదు అంటున్నారు పండితులు. గృహ ప్రవేశం చేస్తున్న వారు వాస్తు శాస్త్రం ప్రకారం ఆ రోజు నీలి రంగు దుస్తులు లేదా నలుపు రంగు దుస్తులను అస్సలే ధరించకూడదంట. వాస్తు శాస్త్రం ప్రకారం గృహ ప్రవేశం రోజు ఈ రంగు దుస్తులు ధరించడం శుభ ప్రదం కాదు అంటున్నారు పండితులు.

2 / 5

అదే విధంగా నూతన గృహ ప్రవేశం రోజున మరో తప్పు కూడా అస్సలే చేయకూడదంట. మీరు వాస్తు శాస్త్రాన్ని నమ్మినట్లు అయితే ఈ రోజున అస్సలే కుటుంబ సభ్యులు ఎవరూ కూడా ఖాళీ చేతులతో ఇంట్లోకి ప్రవేశించకూడదంట. కుటుంబ సభ్యులందరి చేతుల్లో బియ్యం, పండ్లు, పూల వంటివి ఉండాలంట. ఇది చాలా మంచిఫలాలితాలను ఇస్తుందంట. అదే విధంగా నూతన గృహ ప్రవేశం రోజున మరో తప్పు కూడా అస్సలే చేయకూడదంట. మీరు వాస్తు శాస్త్రాన్ని నమ్మినట్లు అయితే ఈ రోజున అస్సలే కుటుంబ సభ్యులు ఎవరూ కూడా ఖాళీ చేతులతో ఇంట్లోకి ప్రవేశించకూడదంట. కుటుంబ సభ్యులందరి చేతుల్లో బియ్యం, పండ్లు, పూల వంటివి ఉండాలంట. ఇది చాలా మంచిఫలాలితాలను ఇస్తుందంట.

3 / 5

అలాగే వాస్తు శాస్త్రం ప్రకారం గృహ ప్రవేశం చేసేటప్పుడు తప్పకుండా కుడి పాదాన్నే ముందు పెట్టాలంట. ఎట్టి పరిస్థితుల్లో ఎడమకాలు పెట్టి గృహ ప్రవేశం చేయకూడదంట. కుడి పాదం పెట్టి కొత్త ఇంట్లోకి అడుగు పెట్టడం వలన అనేక శుభ ఫలితాలు కలుగుతాయంట. అలాగే వాస్తు శాస్త్రం ప్రకారం గృహ ప్రవేశం చేసేటప్పుడు తప్పకుండా కుడి పాదాన్నే ముందు పెట్టాలంట. ఎట్టి పరిస్థితుల్లో ఎడమకాలు పెట్టి గృహ ప్రవేశం చేయకూడదంట. కుడి పాదం పెట్టి కొత్త ఇంట్లోకి అడుగు పెట్టడం వలన అనేక శుభ ఫలితాలు కలుగుతాయంట.

4 / 5

అలాగే గృహ ప్రవేశం చేసే రోజు గోమాతను ఇంటిలోకి ముందుగా ప్రవేశ పెట్టడం వలన అన్ని విధాలుగా కలిసి వస్తుందంట. అంతే కాకుండా ఈ రోజు మీ ఇంటి ఆడపిల్లకు బట్టలు పెట్టి, ఆమెకు బియ్యం పోయడం పూజించడం కూడా చాలా శుభప్రదం అంటున్నారు పండితులు. అలాగే గృహ ప్రవేశం చేసే రోజు గోమాతను ఇంటిలోకి ముందుగా ప్రవేశ పెట్టడం వలన అన్ని విధాలుగా కలిసి వస్తుందంట. అంతే కాకుండా ఈ రోజు మీ ఇంటి ఆడపిల్లకు బట్టలు పెట్టి, ఆమెకు బియ్యం పోయడం పూజించడం కూడా చాలా శుభప్రదం అంటున్నారు పండితులు.

వర్షాకాలంలో ఈ ఆహారాన్ని తింటే ఫుడ్ పాయిజన్ అయ్యే ప్రమాదం పొంచి ఉంది సుమా

వర్షాకాలంలో వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. అయితే ఈ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం కూడా ముఖ్యం. ఈ సీజన్‌లో ఫుడ్ పాయిజనింగ్ ప్రమాదం చాలా పెరుగుతుంది. అటువంటి పరిస్థితిలో వర్షాకాలంలో కొన్ని రకాల ఆహారపదార్థాలను తినవద్దు. ఎందుకంటే కొన్ని రకాల ఆహార పదార్థాలను తినడం వలనా ఆరోగ్యానికి హానికరమ. వర్షాకాలం ఆహ్లాదంగా, చల్లగా ఉంటుంది. అయితే ఈ కాలంలో ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఈ సమయంలో గాలిలో తేమ పెరుగుతుంది. ఇది బ్యాక్టీరియా , ఫంగస్ పెరుగుదల ప్రమాదాన్ని పెంచుతుంది. అందుకే వర్షాకాలంలో ఆహారం త్వరగా చెడిపోతుంది. ఫుడ్ పాయిజనింగ్, డయేరియా, టైఫాయిడ్, కలరా వంటి ఇన్ఫెక్షన్ల ప్రమాదం పెరుగుతుంది. ఈ సీజన్‌లో ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే వర్షాకాలంలో కనిపించిన ప్రతిదీ తినడం సరైనది కాదు. కనుక వర్షాకాలంలో ఏ ఆహారపదార్థాలను తినకూడదో నిపుణుల సలహా ఏమిటో తెలుసుకుందాం.. తద్వారా ఆరోగ్యంపై ఎటువంటి చెడు ప్రభావం ఉండదు. ఫుడ్ పాయిజనింగ్‌ను నివారించవచ్చు. ఫుడ్ పాయిజనింగ్ అంటే ఏమిటి? ఫుడ్ పాయిజనింగ్

Printed, Published and owned by Y. Ramadevi on behalf of NAGAPUBLICATIONS and printed of Koushik Printers, Vidya Nagar, Hyderabad
Published.... 3/5, MIG Flats, KPHB, Hyderabad 500072, Editor Y. Nagaraju, Ph. No. 9059548848 RNI:APTEL/2001/14027